వ్యాపారి ఆత్మహత్య

ముదిగొండ, జూలై 10: అప్పుల బాధ తాళలేక హోటల్ వ్యాపారి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కట్టకూరు గ్రామానికి చెందిన పాకనాటి పిచ్చిరెడ్డి (36) సూర్యాపేట జిల్లా కోదడలో హోటల్ నడుపుతున్నాడు. కొన్నేళ్లుగా అప్పులతో సతమతమవుతున్నాడు. బుధవారం ఉదయం కట్టకూరి శివారులోని ఓ వ్యవసాయ బావిలో పిచ్చిరెడ్డి మృతదేహాన్ని స్థానికులు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి సోదరుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

బీఎంసీయూ నిర్మాణానికి స్థల పరిశీలన

ఎర్రుపాలెం, జూలై 10: మండలంలోని ఇందిరా డైరీ బీఎంసీయూ(బ్లక్ మిల్క్ కూలింగ్ సెంటర్) నిర్మించేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం తహసీల్దార్ ఎం.ఉషాశారద స్థలాన్ని పరిశీలించారు. ఈ స్థలానికి సంబంధించి వివరాలను ఉన్నతాధికారులకు పంపిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేంద్రనాయక్, డీపీఎం దుర్గయ్య, ఆర్ఐ రవి, ఏపీఎం వెంకటేశ్వర్లు, సర్వేయర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పారదర్శకంగా చేపట్టాలి

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి, తిరుమలాయపాలెం మండలాల్లో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

కూసుమంచి, జూలై 10: ప్రజల కోసం చేపడుతున్న పనుల్లో ఎక్కడా అక్రమాలకు తావులేకుండా నిర్మాణ పనులను పారదర్శకంగా చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కూసుమంచి మండలంలో బుధవారం సుమారు రూ.15.5 కోట్ల పలు అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి ప్రారంభించారు. కూసుమంచి మండలంలో 100 పడకల ఆసుపత్రి కోసం నాయకన్‌గూడెం రైతు వేదిక వద్ద ఉన్న స్థలాన్ని పరిశీలించారు. ఈశ్వరమాదారం నాయకన్‌గూడెం మధ్య హైలెవల్ బ్రిడ్జి, పోచారంలో పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. నాయకన్‌గూడెంలో పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేశారు.

అనంతరం పలు కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. నాయకులు బాణోత్ శ్రీను, నరేశ్‌రెడ్డి, స్వర్ణకుమారి, బాలకృష్ణా రెడ్డి, రవి కుమార్, గోపాల్‌రావు, వెంకటరెడ్డి, మట్టె గురవయ్య, హపీజుద్దీన్, మంకెన వాసు, సుధాకర్‌రెడ్డి, భద్రయ్య, అశోక్, కంచర్ల పద్మారెడ్డి, మొదుగు వీరభద్రం, పరశురాం, జహాంగీర్ షరీఫ్ పాల్గొన్నారు.

కూపుమంచి: హైలెవల్ బ్రిడ్జిని ప్రారంభిస్తున్న మంత్రి పొంగులేటి, తిరుమలాయపాలెం మండలంలో మాట్లాడుతున్న మంత్రి

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తా.

తిరుమలాయపాలెం, జూలై 10: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని రాకాసితండా వద్ద రూ.15 కోట్లతో చేపట్టిన హైలెవిల్ బ్రిడ్జి, చెక్‌డ్యామ్, బీటీ రోడ్డును బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. ఆకేరుపై పలు ప్రాంతాల్లో బ్రిడ్జిలు, చెక్‌డ్యామ్‌లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. చిలకొయ్యలపాడు వరకు బీటీ రోడ్డును మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో బోడ మంగీలాల్, బెల్లం శ్రీనివాసరావు, చావా శివరామకృష్ణ, మద్దినేని స్వర్ణ కుమారి, కొప్పుల అశోక్, మద్ది మల్లారెడ్డి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయాలి

రద్దీ ప్రాంతాల్లో అండర్ పాస్‌లకు అనుమతివ్వాలి

'భూసేకరణ'పై సీఎం వీసీలో డిప్యూటీ సీఎం భట్టి

ధంసలాపురం వద్ద ఎంట్రీ, ఎగ్జిట్ ఇవ్వాలి: తుమ్మల

వీడియో కాన్ఫరెన్సులో డిప్యూటీ సీఎం బట్టి, జిల్లా అధికారులు

మామిళ్లగూడెం, జూలై 10: జాతీయ రహదారుల నిర్మాణంలో భాగంగా ఖమ్మం జిల్లాలో పలు ప్రాంతాల్లో సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కోరారు. రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో అండర్ పాస్‌లకు కూడా అనుమతి ఇవ్వాలని విన్నవించారు. 'జాతీయ రహదారుల నిర్మాణానికి భూసేకరణ' అనే అంశంపై సీఎస్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి ఆయా జిల్లాల కలెక్టర్లతో సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్ నుంచి బుధవారం నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో ఖమ్మం కలెక్టరేట్ నుంచి డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడారు. ఖమ్మం పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న జాతీయ రహదారుల నిర్మాణంలో భాగంగా చాలా ప్రాంతాల్లో సర్వీస్ రోడ్లు, అండర్ పాస్‌లులు ఇవ్వలేదని వివరించారు. అనంతరం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. నాగ్‌పూర్–అమరావతి రహదారికి ఖమ్మం నగర పరిధిలో భూములు కోల్పోతున్న వారికి సరైన పరిహారం అందించాలని కోరారు. ఖమ్మం నగరంలోకి ప్రవేశమున్న ధంసలాపురం వద్ద ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు ఇవ్వాలని కోరారు. ఇందుకోసం నేషనల్ హైవేస్ ద్వారా కావాల్సిన భూసేకరణ చేపట్టాలని అన్నారు. అనంతరం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ.. నాగ్‌పూర్ – అమరావతి హైవే భూసేకరణ సమస్యలు పరిష్కరిస్తామని, నెల రోజుల్లో వాటిని పూర్తి చేస్తామని తెలిపారు. పనులు ఆగిన చోట భూములు కోల్పోతున్న వారితో చర్చించి పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ వీసీలో జిల్లా అధికారులు మధుసూదన్‌నాయక్, సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, గణేశ్, దుర్గాప్రసాద్, మీనన్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీల ప్రక్రియ పారదర్శకంగా జరగాలి

నాలుగేళ్ల సర్వీసు పూర్తయిన వారు తప్పనిసరిగా బదిలీ కావాలి

రేపటి వరకూ దరఖాస్తులు స్వీకరించాలి: ఖమ్మం కలెక్టర్ ఖాన్

మామిళ్లగూడెం, జూలై 10: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రభుత్వ ఉద్యోగుల బదిలీ ప్రక్రియ జిల్లాలో పారదర్శకంగా జరగాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. ప్రభుత్వ ఉద్యోగుల బదిలీ ప్రక్రియపై జిల్లా అధికారులతో కలెక్టరేట్‌లో బుధవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉద్యోగుల బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ బదిలీలకు అవకాశం ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని గుర్తుచేశారు. జిల్లా క్యాడర్ పోస్టుల బదిలీ ప్రక్రియ కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటు చేసే కమిటీ పర్యవేక్షిస్తుందని తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల్లోని నిబంధనల ప్రకారం నాలుగేళ్లు ఒకేచోట సర్వీసు పూర్తి చేసిన సిబ్బందిని తప్పనిసరిగా బదిలీ చేయాలని సూచించారు. అదే సమయంలో రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులు కూడా బదిలీ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. ఇందుకోసం ఈ నెల 12 వరకు బదిలీల కోసం దరఖాస్తులు స్వీకరించాలన్నారు. బదిలీ కోసం వచ్చిన దరఖాస్తు వివరాలను నమోదు చేసి పారదర్శకంగా కౌన్సెలింగ్ నిర్వహించి నిబంధనల ప్రకారం బదిలీ ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. కాగా, కలెక్టరేట్ ఎదుట బస్ షెల్టర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. తాగునీటి కోసం ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్లాస్టిక్ వినియోగం నియంత్రించాలని, ప్లాస్టిక్ బాటిళ్లు వినియోగించకూడదని, స్టీల్ వాటర్ బాటిళ్లు వినియోగించాలని సూచించారు. శానిటేషన్ సిబ్బందికి ప్రతి నెలా వేతనం అందేలా చూడాలన్నారు. అధికారులు, ఉద్యోగుల హెల్త్ ప్రొఫైల్ కోసం చర్యలు చేపట్టాలన్నారు. అధికారులు రాజేశ్వరి, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా దొంగ అరెస్టు

వివరాలు వెల్లడించిన ఏసీపీ రఘు

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ రఘు

సత్తుపల్లిటౌన్, జూలై 10: సత్తుపల్లి బస్టాండ్‌లో తిరుగుతూ బస్సుల్లో ప్రయాణించే మహిళల వద్ద నుంచి చోరీ చేసే ఓ మహిళను బుధవారం అదుపులోకి తీసుకున్నట్లు ఏసీపీ రఘు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నూజివీడుకు చెందిన దేవరకొండ దుర్గ అనే మహిళ సత్తుపల్లి బస్టాండ్‌లో తిరుగుతూ ప్రయాణికులు ఒంటరిగా ఉన్న సమయంలో, బస్సులు ఎక్కే సమయాల్లో వారి దగ్గర ఉన్న బ్యాగుల్లో సొమ్మును దొంగిలించి తిరుగుతుందని ఏసీపీ తెలిపారు. ఈ క్రమంలో సత్తుపల్లి సీఐ కిరణ్ బుధవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆటోలో ప్రయాణిస్తూ పోలీసులను చూసి పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నారు. ఆమె వద్ద ఉన్న బ్యాగును పరిశీలించగా బంగారు వస్తువుల డబ్బాను స్వాధీనం చేసుకున్నారు. దానిలో ఒక చంద్రహారం, నాలుగు గాజులు, రెండు చైన్లు, మూడు ఉంగరాలను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం బస్టాండ్‌లో ఓ మహిళ వద్ద దొంగతనం చేసినట్లు ఆమె ఒప్పుకున్నట్లు ఆయన తెలిపారు. నిందితురాలు దుర్గను రిమాండ్ చేసినట్లు తెలిపారు. విలేకర్ల సమావేశంలో సీఐ కిరణ్‌తో పాటు, పోలీసులు పాల్గొన్నారు.

పాలాలను పరిశీలించిన ఎమ్మెల్యే

సత్తుపల్లి, జూలై 10: మండల పరిధిలోని కిష్టాపురం, తుమ్మూరు గ్రామాల్లో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పంట పొలాలు నీట మునగడంతో బుధవారం ఎమ్మెల్యే రాగమయి రైతులతో కలిసి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏ మేర నష్టం వాటిల్లిందో తెలుసుకొని మంత్రులు, అధికారుల దృష్టికి తీసుకెళ్తామని రైతులకు హామీ ఇచ్చారు. ఆమె వెంట సుబ్బారెడ్డి, ప్రసాద్, జోగారావు, రైతులు ఉన్నారు.

నోట్ పుస్తకాలు వితరణ

కొణిజర్ల, జూలై 10: మండల పరిధిలోని తనికెళ్ల ఎంపీపీఎస్ (హరిజనవాడ) పాఠశాలలో గ్రామానికి చెందిన నరేష్ కుమార్తెలు లిఖిత, లితిక జన్మదినం సందర్భంగా విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, విద్యా సామగ్రిని బుధవారం పంపిణీ చేశారు. కాంప్లెక్స్ హెచ్ఎం అబ్రహాం, ఏఏపీసీ చైర్మన్ సరస్వతి, హెచ్ఎం వాసిరెడ్డి రామ్మోహన్ దాతను అభినందించారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ

పెనుబల్లి, జూలై 10: లయన్స్ క్లబ్ సప్తగిరి వీ.ఎం.బంజర వారి ఆధ్వర్యంలో మండలంలోని వీ.ఎం.బంజర ప్రైమరీ, యూపీఎస్ స్కూల్స్ పాఠశాలలో పెనుబల్లి రావిచెట్టు స్కూల్, గంగిదేవిపాడు, బ్రాహ్మళ కుంట, పెరుమాళ్లకుంట, తాళ్లపెంట, టేకులపల్లి, కరమతునాయక్ పాఠశాలల విద్యార్థులకు బుధవారం నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఎస్.కే.అబ్దుల్‌సలాం, శ్రీధరాల సుబ్బారావు, మిట్టపల్లి శ్రీధర్, కారుమంచి ఆనంద్, పొన్నగంటి వినాయకప్రసాద్ పాల్గొన్నారు.

కుట్టు మిషన్లు పంపిణీ

పెనుబల్లి, జూలై 10: కల్లూరు మండల కేంద్రంలోని టీజీఎం గౌడ్స్‌లో సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ యాక్షన్ ఆధ్వర్యంలో 20 మంది మహిళలకు బుధవారం ఉచితంగా కుట్టుమిషన్లను తహసీల్దార్ పులి సాంబశివుడు, ఏఐసీసీ రాష్ట్ర అధ్యక్షుడు, సీడీఏ కార్యదర్శి పీ.ఎనోష్‌కుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్, సెంటర్‌ఫర్ డెవలప్‌మెంట్ యాక్షన్ కార్యదర్శి ఎనోష్‌కుమార్ మాట్లాడుతూ.. సీడీఏ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కుట్టుమిషన్ ట్రైనింగ్ సెంటర్ నడుపుతున్నామని, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

జాతీయస్థాయిలో సత్తుపల్లి విద్యార్థుల ప్రతిభ

ప్రతిభ కనబరిచిన విద్యార్థినులు

సత్తుపల్లి, జూలై 10: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కాకినాడలో కాకినాడ నృత్యంజలి ఆధ్వర్యంలో ఈ నెల 7, 8, 9 తేదీల్లో జరిగిన జాతీయస్థాయి శాస్త్రీయ నృత్యోత్సవంలో సత్తుపల్లికి చెందిన వీఎంఆర్ ఆర్ట్స్ అకాడమీకి చెందిన ఆరుగురు చిన్నారులు ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక విశ్రాంతి విద్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన నత్యాచారిని అనూషబహుదూర్, విజేతలుగా నిలిచిన ఆరాధ్య, వేద్య, యశ్విత, నందన, సహస్ర, దైవికను అభినందించారు.

గ్రావెల్ తవ్వకాలపై 'లోకాయుక్త' విచారణ

హద్దులు చూపడంలో మైనింగ్ శాఖ అధికారులు విఫలం

లోకాయుక్త స్టేట్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ మాథ్యూ ఆగ్రహం

విచారణ చేపడుతున్న లోకాయుక్త స్టేట్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ మాథ్యూకోషి

రఘునాథపాలెం, జూలై 10: రఘునాథపాలెం మండలం కోయచలక, చింతగుర్తి, మంచుకొండ రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూముల్లో జరిగిన మొరం అక్రమ తవ్వకాలపై లోకాయుక్త బుధవారం విచారణ చేపట్టింది. 2023 జనవరి, మార్చి నెలల్లో రెండు దఫాలుగా జరిగిన విచారణపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ సామాజిక కార్యకర్త కోయిని వెంకన్న, రఘునాథపాలెం నివాసి మంద బుచ్చిబాబు, ఎల్‌హెచ్‌పీఎస్ నాయకుడు భద్రూనాయక్‌లు మరోమారు లోకాయుక్తను ఆశ్రయించారు. ఆయా రెవెన్యూల పరిధిలోని 192/1, 266, 366 నుంచి 327, 30, 218, 360 సర్వే నెంబర్లు గల గుట్టల్లో లీజుకు మించి అక్రమంగా మట్టి తవ్వకాలు జరిగాయంటూ ఫిర్యాదుదారులు లోకాయుక్తకు విన్నవించారు. నాడు విచారణ చేపట్టిన లోకాయుక్త.. 3.50 లక్షల క్యూబిక్ మీటర్ల గ్రావెల్‌ను లీజుదారుడు అక్రమంగా తవ్వినట్లు తేల్చింది. అయితే దీనిపై మళ్లీ అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఫిర్యాదుదారులు మరోమారు లోకాయుక్తను ఆశ్రయించారు. దీంతో తెలంగాణ రాష్ట్ర లోకాయుక్త ఇన్వెస్టిగేషన్ అధికారి మాత్యూకోషి బుధవారం విచారణకు వచ్చారు. దీంతో మైనింగ్, సర్వే అధికారులతో కలిసి మట్టి తవ్వకాలు జరిగిన ప్రాంతంలో విచారణ చేశారు. 11 హెక్టార్లలో గ్రావెల్ తవ్వకానికి అనుమతులు పొందిన వ్యక్తి 280 ఎకరాల్లో 16 లక్షల క్యూబిక్ మీటర్లను అదనంగా తవ్వినట్లు విచారణకు వచ్చిన లోకాయుక్త అధికారులకు సామాజిక కార్యకర్త కోయిన్ని వెంకన్న వివరించారు. అయితే లోకాయుక్త అధికారి సర్వేకు వచ్చిన సమయంలో మైనింగ్ అధికారులు లీజు పొందిన ప్రదేశంలో హద్దులు చూపించలేకపోయారు. దీంతో లోకాయుక్త ఇన్వెస్టిగేషన్ అధికారి మాథ్యుకోషి.. మైనింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విచారణ సమయంలో కిలోమీటర్ల కొద్దీ జరిగిన తవ్వకాలను గమనించారు. అధికారులు హద్దులను చూపించకలేక పోవడంతో విచారణ అధికారి సైతం అధికారుల వైఫల్యంపై నివేదికను రాసుకున్నట్లు తెలిసింది. ముందుగా తహసీల్దార్ ఆఫీస్‌కు వెళ్లిన విచారణ అధికారి మాథ్యుకోషి.. లీజుదారుడు అనుమతి పొందిన సర్వే నెంబర్లకు సంబంధించిన వివరాలను సేకరించారు. ఈ విచారణలో తహసీల్దార్ లూథర్ విల్సన్, సర్వే ఏడీ శ్రీనివాసరావు, మైనింగ్ అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

అడిషనల్ కలెక్టర్ మధుసూదన్‌నాయక్

అధికారులకు సూచనలు చేస్తున్న అడిషనల్ కలెక్టర్

కొణిజర్ల, జూలై 10: మండలంలో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను సత్వరమే పరిష్కారమయ్యేలా అధికారులు పనిచేయాలని అడిషనల్ కలెక్టర్ మధుసూదన్‌నాయక్ అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన మండల వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులపై ఆరా తీశారు. మిస్సింగ్ సర్వే నెంబర్లు, ఇతర పెండింగ్‌లకు సంబంధించి సజావుగా ఉన్న వాటిని వెంటనే ఫైల్ తయారు చేసి కలెక్టరేట్‌కు సిఫారసు చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థుల వసతి గృహాలను సందర్శించి నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాంబాబు, డిప్యూటీ తహసీల్దార్ ఎర్రయ్య, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

పాఠశాలలను తనిఖీ చేసిన డీఈవో

తరగతి గదులను పరిశీలిస్తున్న డీఈవో

కొణిజర్ల, జూలై 10: మండలంలోని చిన్నగోపతి యూపీఎస్, పెద్దమునగాల జడ్పీహెచ్ఎస్ పాఠశాలలను బుధవారం డీఈవో సోమశేఖర శర్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల యొక్క పురోభివృద్ధిని, వనమహోత్సవంలో భాగంగా ఎన్ని మొక్కలు నాటారు, పిల్లల హాజరు తదితర వివరాలను పాఠశాల ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు పాఠాలు బోధించి వారిని పలుప్రశ్నలు అడిగి వారి సామార్థ్యాన్ని తెలుసుకున్నారు. వంద శాతం ఉత్తీర్ణత ఉండేలా చూసుకోవాలని, పాఠశాలకు రాని విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేసి విద్యార్థులు పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈవో ఎం.శ్యాంసన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రూప్-1 మెయిన్స్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం ఎడ్యుకేషన్, జూలై 10: టీజీ బీసీ స్టడీసర్కిల్ ఆధ్వర్యంలో గ్రూప్–1 మెయిన్స్‌కు ఉచిత శిక్షణ కార్యక్రమం ఈ నెల 22 నుంచి ప్రారంభమవుతుందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సంస్థ డైరెక్టర్ శ్రీలత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక చేసిన 150 మంది అభ్యర్థులకు 75 రోజులపాటు శిక్షణ ఉంటుందని, వారికి నెలకు రూ.5 వేలు ఉపకార వేతనం అందుతుందని వివరించారు. మెయిన్స్‌కి అర్హత సాధించిన అభ్యర్థులు ఈ నెల 19లోగా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9573859598ను సంప్రదించాలని కోరారు.

కొనసాగుతున్న ఎప్‌సెట్ కౌన్సెలింగ్

ఖమ్మం ఎడ్యుకేషన్, జూలై 10: ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం చేపట్టిన ఎప్‌సెట్ కౌన్సెలింగ్ ఐదు రోజులుగా తమ కళాశాలలో కొనసాగుతోందని ఖమ్మం ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జాకీరుల్లా బుధవారం తెలిపారు. బుధవారం నాటి షెడ్యూల్‌కు 800 మంది స్లాట్ బుక్ చేసుకున్నాని, వారిలో 780 మంది హాజరయ్యారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు, రాజమండ్రి, కాకినాడ, విజయవాడ ప్రాంతాల నుంచి 25 మంది విద్యార్థులు కౌన్సెలింగ్‌కు వచ్చారని కోఆర్డినేటర్ డాక్టర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ నెల 13 వరకు కౌన్సెలింగ్ కొనసాగుతుందని వివరించారు.

'దోస్త్' కౌన్సెలింగ్ రేపు తుది గడువు

ఖమ్మం ఎడ్యుకేషన్, జూలై 10: డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల కోసం డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) ద్వారా ఈ విద్యాసంవత్సరానికి మూడు దశల్లో సీట్లు పొందిన విద్యార్థులు సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకావాలని ఖమ్మం ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ జాకీరుల్లా బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. ఇందుకోసం ఈ నెల 12 వరకు చివరి గడువు ఉందని చెప్పారు. గైర్హాజరైన విద్యార్థులు సీట్లు కోల్పోతారని వివరించారు.

క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో 'ఎస్‌బీఐటీ' విద్యార్థుల ఎంపిక

ఎంపికైన విద్యార్థులతో కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ

ఖమ్మం ఎడ్యుకేషన్, జూలై 10: నగరంలోని ఎస్‌బీఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో తృతీయ సంవత్సరం విద్యార్థులు క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో ఉద్యోగాలు సాధించారని కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. వీటీఎస్ ఎంటర్‌ప్రైజేస్ సంస్థ నిర్వహించిన ప్రక్రియలో 11 మంది విద్యార్థులు ఎంపికైనట్లు చెప్పారు. కాగా, ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ కృష్ణ, కరస్పాండెంట్ డాక్టర్ ధాత్రి, ప్రిన్సిపాల్, అధ్యాపకులు బుధవారం తమ కళాశాలలో అభినందించారు.

శ్రీచైతన్య విద్యార్థులకు ఐబీఎం సర్టిఫికెట్స్

ఐబీఎం సర్టిఫికెట్స్ పొందిన విద్యార్థులు కళాశాల చైర్మన్, డైరక్టర్లు

ఖమ్మం రూరల్, జూలై 10: మండల పరిధిలోని శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు బుధవారం ప్రఖ్యాత బహుళజాతి కంపెనీ ఐబీఎం సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ మాట్లాడుతూ.. కళాశాల విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఐబీఎం కంపెనీతో ఎంఓయూ కుదుర్చుకున్నామని అన్నారు. డైరెక్టర్లు శ్రీవిద్య, సాయి గీతిక మాట్లాడుతూ.. యువతకు కావాల్సిన ఉపాధి నైపుణ్యాల అభివృద్ధికి సహకారం అందించాడానికి కళాశాల ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. హెచ్ఓడీ డాక్టర్ సుదర్శన్, డాక్టర్ రాజేష్, డాక్టర్ హరి ప్రసాద్, భవానీ, పద్మ, శారద, సతీష్, సదాలక్ష్మి, మల్లికార్జున్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ఖమ్మం రూరల్, జూలై 10: ఉద్యోగోన్నతి పొందిన ఉపాధ్యాయులకు మండలంలోని మంగళగూడెం పాఠశాలలో బుధవారం సన్మానం చేశారు. ఉద్యోగోన్నతి పొందిన ఉపాధ్యాయులు లూర్తుమేరీ, వీ నందియా, జీ పాపారావుకు పుష్పగుచ్చాలు అందజేసి, ఘనంగా సత్కరించారు. ఎంఈవో మోదుగు శ్యాంసన్, రాధిక, దేవేంద్రమ్మ, రవి, గురువయ్య, వెంకటప్పయ్య, నాగిరెడ్డి పాల్గొన్నారు.

దమ్మాయిగూడెంలో చెట్ల నరికివేత

చెట్లను నరికివేసిన దృశ్యం

తిరుమలాయపాలెం, జూలై 10: మండలంలోని దమ్మాయిగూడెంలో పల్లెప్రకృతి వనం చెట్లను నరికివేశారు. కేసీఆర్ ప్రభుత్వం హరిత హారంలో భాగంగా ప్రతి గ్రామంలో పల్లెప్రకృతి వనాలను చేపట్టిన విషయం విధితమే. మండలంలోని దమ్మాయిగూడెంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నుంచి పంచాయతీ కార్యాలయానికి వెళ్లే ప్రధాన రహదారిలో వరద కాల్వ పక్కన పల్లెప్రకృతి వనాన్ని ఏర్పాటు చేశారు. పల్లెప్రకృతి వనంలో నాడు నాటిన మొక్కలు నేడు పెద్ద చెట్లుగా ఎదిగాయి. ప్రకృతివనం పక్కన పొలాలు ఉన్న రైతులు చెట్లపైకి కోతులు వచ్చి తమ పంటలను పాడు చేస్తున్నాయనే కారణంతో నరికివేశారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి రాంలాల్‌ను వివరణ కోరగా చెట్లు నరికిన విషయం నిజమేనని, బాధితులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.

ప్రకటన

ఇందుమూలముగా నాక్షయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **నేలకొండపల్లి బ్రాంచ్** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **భూక్య శ్రీదేవి**, W/o : **రాంబాబు**, **వయస్సు** : 34 సం॥లు, **వృత్తి** : గృహిణి, **నివాసం** : రాజుతండ, మల్లాయిగూడెం గ్రామము, కూసుమంచి మండలము, ఖమ్మం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, కైయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి **5** రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్షయింటు బాధ్యులు కారు.

**షెడ్యూలు ఆస్తి